క్లుప్తంగా

పదోన్నతులపై హర్షం



పుష్పగుచ్ఛం ఇచ్చి కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రేడ్‌–3 ఏఎన్‌ఎంలు, ఎన్జీవో నాయకులు

ఏలూరు(మెట్రో): సచివాలయ వ్యవస్థలో పని చేస్తున్న గ్రేడ్‌–3 ఏఎన్‌ఎంలకు ఎంపీహెచ్‌ఏ(ఎఫ్‌)గా పదోన్నతులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇచ్చిన సందర్భంగా ఏఎన్‌ఎంలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్‌ ఆర్‌.మాలిని, అడ్మినిస్ట్రేటివ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ గంగా భవానీలకు ఏపీ ఎన్జీవోస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఏపీ ఎన్జీవోస్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్‌, కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, కార్యాలయ సీనియర్‌ అసిస్టెంట్‌ కరీం తదితరులు పాల్గొన్నారు.

గుగ్గులోతు కృష్ణ మాస్టర్‌కు డాక్టరేట్‌



గౌరవ డాక్టరేట్‌ అందుకుంటున్న గుగ్గులోతు కృష్ణ మాస్టారు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యారంగంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో తన వంతు బాధ్యత నిర్వహిస్తున్న మోడల్‌ ప్రైమరీ స్కూల్‌ ప్రధానోపాధ్యాయుడు ఏలూరుకు చెందిన గుగ్గులోతు కృష్ణ మాస్టారుకు ఆసియా వేదిక్‌ ఇంటర్నేషనల్‌ కల్చర్‌, రీసెర్చ్‌, స్ఫూర్తి అకాడమీ ప్రతినిధులు సంయుక్తంగా గౌరవ డాక్టరేట్‌ అందజేశారు. హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన డాక్టరేట్ల ప్రదానోత్సవంలో ఈ గౌరవం లభించింది. ఈ డాక్టరేట్‌తో మరింత బాధ్యత పెరిగిందని గుగ్గులోతు కృష్ణ అన్నారు. టీచర్స్‌ ఫెడరేషన్‌ 1938 జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మోహన్‌ రావు, రామ్మోహన్‌ రావు తదితరులు అభినందనలు తెలిపారు.

డిజిటల్‌ అరెస్ట్‌ పేరుతో మోసాలు

వెంటనే 1930కి ఫిర్యాదు చేయాలంటున్న పోలీసులు

ఏలూరు విద్యానగర్‌కు చెందిన ఒక మహిళను ముంబై నుంచి కస్టమ్స్‌ అధికారులమని.. కస్టమ్స్‌లో మీ పేరుతో పార్సిల్‌ వచ్చిందని, అక్రమ వస్తువులు ఉన్నాయంటూ వీడియో కాల్‌లో బెదిరింపులకు పాల్పడ్డారు. మీపై కేసు లేకుండా చేసేందుకు డబ్బులు ఆన్‌లైన్‌లో పంపాలని డిమాండ్‌ చేశారు. మహిళ తీవ్ర ఆందోళనతో రూ.26 లక్షల వరకూ వారికి చెల్లించింది. తీరా మోసమని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఏలూరు నగరానికి చెందిన ఒక వ్యక్తికి కాల్‌ చేసిన సైబర్‌ నేరగాళ్లు.. మీ మొబైల్‌ ఫోన్‌ నెంబర్‌ అక్రమ కార్యకలాపాలకు లింక్‌ చేశారని, మీపై కేసు నమోదు చేస్తున్నామని, డిజిటల్‌ అరెస్ట్‌ చేశామని, మీరు ముంబై రావాలంటూ నకిలీ పోలీసులు బెదిరించారు. కేసు లేకుండా చేయాలంటే డబ్బులు చెల్లించాలని డిమాండ్‌ చేయటంతో రూ.7 లక్షల వరకూ సైబర్‌ నేరగాళ్ళు కాజేశారు.

ఏలూరు టౌన్‌: ఏలూరు నగరంలోనే అనేక మంది సైబర్‌ నేరగాళ్ల బారిన పడి లక్షల్లో సొమ్ములు పోగొట్టుకున్న సంఘటనలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో ఉద్యోగాలు, వ్యాపారాలు, అధిక సంపాదన పేరుతో జనాలను నమ్మించి మాయమాటలతో భారీఎత్తున డబ్బులు కాజేస్తుండగా.. మరోవైపు డిజిటల్‌ అరెస్టులని, కస్టమ్స్‌ అధికారులమని, ముంబైకి చెందిన పోలీస్‌ ఉన్నతాధికారులమంటూ బెదిరింపులకు పాల్పడుతూ సొమ్ము చేసుకునే ముఠాలు ఎక్కువయ్యాయి. మీ బంధువుని అరెస్ట్‌ చేశామని, మీరు డబ్బులు చెల్లించాలని అంటూ నకిలీ పోలీసులు బెదిరిస్తున్నారు. చదువుకున్న వ్యక్తులను, డబ్బున్న వారిని టార్గెట్‌ చేస్తున్నారు సైబర్‌ నేరగాళ్ళు. నేటి ఆధునిక సమాజంలో నేరగాళ్లు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ఇట్టే బురిడీ కొట్టిస్తు డబ్బులు కాజేస్తున్నారు.

సైబర్‌ మోసాలు ఇలా..

● ట్రాయ్‌ నుంచి కాల్‌ చేస్తున్నట్లు సైబర్‌ నేరగాళ్లు నటిస్తారు. మీ ఫోన్‌నెంబర్‌ అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారని, సేవలు నిలిపివేస్తామంటూ బెదిరిస్తారు. కానీ ట్రాయ్‌ సేవలను నిలిపివేయదనే విషయాన్ని తెలుసుకోవాలి.

● మీ పేరుతో విదేశాల నుంచి పార్శిల్‌ కస్టమ్స్‌లో నిలిచిపోయిందని, పార్శిల్‌లో అక్రమ వస్తువులు ఉన్నాయని, మీపై దేశద్రోహం కేసు నమోదైందని, డబ్బులు చెల్లిస్తే కేసు లేకుండా చేస్తామంటూ బెదిరిస్తారు. ఇలాంటి కాల్స్‌ను వెంటనే కట్‌ చేయాలని సైబర్‌క్రైమ్‌ పోలీసులకు చెబుతున్నారు.



సైబర్‌ నేరాలపై అవగాహన పోస్టర్‌ (ఫైల్‌)

● ముంబై, ఢిల్లీ, బెంగుళూరు వంటి పెద్ద నగరాల నుంచి కాల్‌ చేసి.. మిమ్మల్ని డిజిటల్‌ అరెస్ట్‌ చేశామని, ఆన్‌లైన్‌లో విచారణ చేయాలంటూ నకిలీ పోలీస్‌ అధికారులు బెదిరింపులకు పాల్పడతారు. నిజానికి పోలీసులు డిజిటల్‌ అరెస్ట్‌ చేయరు. ఆన్‌లైన్‌ విచారణ ఏమీ ఉండదని పోలీస్‌ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● సోషల్‌మీడియాలో మిమ్మల్ని పరిచయం చేసుకుంటూ సులువుగా ఇంటినుంచే భారీగా డబ్బులు సంపాదించవచ్చని, బంగారం, స్టాక్‌ మార్కెట్‌, ఇతర కంపెనీల్లో పెట్టుబడులు పెట్టాలంటూ ఆశ జూపుతారు. తొలుత కొంత లాభాలు వచ్చినట్లు చూపిస్తూ ప్రలోభపెడతారు. వాస్తవానికి ఇలాంటి డబ్బు సంపాదన ప్రకటనలతో అనేక మంది మోసపోయారు.

● సైబర్‌ నేరగాళ్లు కాల్‌ చేసి మీకు విదేశాల నుంచి బహుమతులు వచ్చాయని, మీరు టాక్స్‌ చెల్లిస్తే మీ ఇంటికి పార్శిల్‌ వస్తుందని మాయమాటలతో నమ్మిస్తారు. ట్యాక్స్‌ పేరుతో డబ్బులు గుంజుకుని సైలెంట్‌ అవుతారు. వీటిపై అవగాహన కలిగి ఉండాలి.

● మీ పేరుతో క్రెడిట్‌ కార్డ్‌ జారీ చేశామంటూ నకిలీ ఎగ్జిక్యూటివ్స్‌ ఫోన్‌ చేసి నమ్మిస్తారు. బోగస్‌ క్రెడిట్‌ కార్డులను జారీ చేయటంతోపాటు, భారీగా మీ నుంచి డబ్బు లాక్కునే ప్రమాదం ఉందని పోలీస్‌ అధికారులు హెచ్చరిస్తున్నారు.

సైబర్‌ నేరాలపై ఫిర్యాదు చేయాలి



సైబర్‌ నేరగాళ్ళు ప్రజలను ఇట్టే మోసం చేస్తున్నారు. విద్యావంతులు సైతం సైబర్‌ నేరగాళ్ల బారిన పడి భారీగా డబ్బు పోగొట్టుకుంటున్నారు. నేరాలపై అవగాహన కలిగి ఉంటే సైబర్‌ నేరాల నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. బ్యాంకు కేవైసీ, ఆన్‌లైన్‌ సంపాదన, డిజిటల్‌ అరెస్ట్‌, కస్టమ్స్‌ పేరుతో అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. సైబర్‌ నేరాలపై వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్‌క్రైమ్‌.జీవోవీ.ఇన్‌లో లేదా డయల్‌ 1930కు ఫిర్యాదు చేస్తే వెంటనే దర్యాప్తు చేస్తారు.

డీ శ్రావణ్‌కుమార్‌, డీఎస్పీ, ఏలూరు

జెండా దిమ్మెల ఏర్పాటు

బుట్టాయగూడెం: మండలంలోని కొమ్ముగూడెం, అచ్చియ్యపాలెంలో ఆదివారం జెండా దిమ్మల నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమాలను ఎంఆర్‌పీఎస్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సోంపల్లి సిద్దు, కూచిపూడి సత్యం మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో ఎంఆర్‌పీఎస్‌ నూతన కమిటీ నిర్మాణం, ఇంటర్‌, డిగ్రీ, పీజీ చేస్తున్న యువకులతో భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జెండా దిమ్మలు నిర్మాణం కూడా చేపడుతున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు బొబ్బర ఎలీషా, చిడిపి గంగాధర్‌, తదితరులు పాల్గొన్నారు.

భారతీయ సంవిధాన్‌ హత్య దివస్‌

జంగారెడ్డిగూడెం: బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో భారతీయ సంవిధాన్‌ హత్య దివస్‌ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో పట్టణ అధ్యక్షుడు తాటికొండ సుధాకర్‌ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పూర్వ అధ్యక్షుడు కొప్పాక శ్రీనివాసరావు మాట్లాడుతూ 1975 నుంచి 1977 వరకు కాంగ్రెస్‌ పార్టీ నేతృత్వంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని, నాటి జన సంఘం నేతలను, ఆర్‌ఎస్‌ఎస్‌ కార్యకర్తల ఇళ్ల మీదకి జొరబడి దాడి చేసి వాళ్లని అరెస్టు చేశారన్నారు. ఈ సందర్భంలో మన జంగారెడ్డిగూడెం పట్టణ ప్రాంతానికి చెందిన వార్డెన్‌ శర్మగా సుపరిచితులైన సూరంపూడి సుబ్బారాయ శర్మ అప్పట్లో ఇబ్బందులు పడ్డారన్నారు. పట్టణ బీజేపీ తరుపున సుబ్బరాయశర్మను సన్మానించారు. బీజేపీ నేతలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య ఉద్యోగుల బిల్లులు చెల్లించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న పర్మినెంట్‌ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, మెడికల్‌ బిల్లులు, లీవ్‌ బిల్లులు వెంటనే చెల్లించాలని మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ డిమాండ్‌ చేసింది. ఆదివారం స్ఫూర్తి భవనంలో మున్సిపల్‌ ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌ డాంగే, ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ జిల్లా కార్యదర్శి బజంత్రీ శ్రీనివాస్‌ మాట్లాడుతూ మున్సిపల్‌ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న 140 మంది పర్మినెంట్‌ ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు, మెడికల్‌ బిల్లులు, లీవ్‌ ఎన్‌క్యాష్‌మెంట్‌ 3 సంవత్సరాల నుంచి బకాయి ఉన్నాయన్నారు. వీరిలో చాలామందికి మూడు సంవత్సరాల నుంచి ఇంక్రిమెంట్లు, స్పెషల్‌ ఇంక్రిమెంట్లు చెల్లించడం లేదన్నారు. ఉద్యోగులు బిల్లుల కోసం ఆఫీస్‌ చుట్టూ పదేపదే తిరుగుతున్నా సాంకేతిక కారణాలు చెబుతూ చెల్లించడం లేదన్నారు. బకాయి బిల్లులు వెంటనే క్లియర్‌ చేయాలని డిమాండ్‌ చేశారు. మున్సిపల్‌ వర్కర్స్‌ యూనియన్‌ ఏలూరు నగర ఉపాధ్యక్షుడు బంగారు దుర్గాప్రసాద్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సభ్యులు హేడారి వంశీ, ఏ ప్రసాద్‌, పొద్దుటూరి సురేష్‌, పుచ్చ శంకర్‌, బంగారు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి శ్రీనివాస డాంగే

మానవత నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

జంగారెడ్డిగూడెం: మానవత జంగారెడ్డిగూడెం మండల నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడు అయినాల రమణమూర్తి ఆధ్వర్యంలో గుర్వాయిగూడెం మానవత కమ్యూనిటీ హాల్‌ నందు ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా అధ్యక్షుడు దేవినేని భాస్కర్‌ నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా అల్లూరి రాకమృష్ణ, కార్యదర్శిగా మధుకుమార్‌, ట్రెజరర్‌గా ఇమ్మంది మాధవరావు, ఉపాధ్యక్షుడిగా గంధం గోపాలకృష్ణ, జాయింట్‌ సెక్రటరీగా బేతా రమేష్‌, ఈసీ సభ్యులుగా మాతంశెట్టి నాగేశ్వరరావు, దల్లి అప్పలరెడ్డి, తన్నీరు రామకృష్ణ, దారా సురేష్‌గుప్త ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన కరాటం రాంబాబు, జెట్టి గురునాథరావు, పోల్నాటిబాబ్జి, గుర్వాయిగూడెం సర్పంచ్‌ గుబ్బల సత్యవేణి, పెనుమర్తి రాంకుమార్‌, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్‌, చావా రమేష్‌ కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలనే డిమాండ్‌తో జూన్‌ 30న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేషనల్‌ దళిత జేఏసీ చైర్మన్‌ పెరికే వరప్రసాదరావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఇజ్రాయిల్‌పేట బాబు జగ్జీవన్‌రామ్‌ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విజయవాడ జింఖానా గ్రౌండ్‌ లో సోమవారం సాయంత్రం బహిరంగ సభ జరుగుతుందని, సభకు దళిత క్రైస్తవులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. 1956లో సిక్కు మతం తీసుకున్న దళితులకు ఎస్సీ హోదా ఇచ్చారని, 1990లో బీఆర్‌ అంబేద్కర్‌ గౌరవార్థం దళిత బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించారని గుర్తు చేశారు. 1996లో అప్పటి ప్రధానమంత్రి పీవీ నరసింహారావు దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తామని పార్లమెంట్‌లో బిల్లు పెట్టి, సాంకేతిక లోపాలను సాకుగా చూపి చేతులు దులుపుకున్నారన్నారు. ఈ బిల్లును వచ్చే పార్లమెంట్‌ సమావేశాల్లో ఆమోదించి.. క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని కోరారు. సిటీ పాస్టర్స్‌ అసోసియేషన్‌ ప్రెసిడెంట్‌ బీరపోగు యోహాను మాట్లాడుతూ క్రైస్తవులపై, మతబోధనలపై దాడులను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్‌ పేట బాప్టిస్ట్‌ చర్చి అధ్యక్షుడు జుంజు మోజస్‌, బొప్పిడి సతీష్‌ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పెరికే వరప్రసాద రావు

వృద్ధాశ్రమంలో అన్నసమారాధన

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్‌ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కల్పవృక్షం వృద్ధాశ్రమంలో ఆదివారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌ సీపీ పోలవరం నియోజకవర్గ నేత, పారిశ్రామికవేత్త దివంగత పోతన శేషగిరిరావు శేష జ్ఞాపకార్థం ఆయన కుమారుడు గణేష్‌ రాయుడు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు ఒక రోజుకు సరిపడా భోజన వసతి పౌష్టికాహారాన్ని సమకూర్చారు. కొయ్యలగూడెం, కన్నాపురం, పోలవరం, గొల్లగూడెంలోని వృద్ధాశ్రమాలకు శేషగిరిరావు సహాయ సహకారాలు అందించారని ఆశ్రమ నిర్వాహకులు మాజేటి అప్పలరాజు పేర్కొన్నారు. ఆశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని రాజా గణేష్‌ రాయుడు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజేటి సత్యనారాయణ, దారం సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

దాసు సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా సంధ్య

కుక్కునూరు: కుక్కునూరు మండల దాసు సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా పల్లం సంధ్యారాణి, బట్టు కమలాకర్‌ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సంఘ సమావేశం మండలంలోని ఉప్పేరు గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ, దాసు సామాజిక వర్గ ఐక్యతకు, అభివృద్ధికి, సంస్కృతి, సాంప్రదాయలను కాపాడేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటైన నూతన కమిటీలో ఉపాధ్యక్షులుగా పల్లం పార్వతి, సహాయ కార్యదర్శిగా పాముల లక్ష్మణ్‌రావు, కోశాధికారిగా సీహెచ్‌ నారాయణదాస్‌, కార్యవర్గ సభ్యులుగా యర్నం నరసింహారావు, పాముల కాళిదాసు, వాసు, రమాదేవి తదితరులను ఎన్నుకున్నారు.

వైఎస్సార్‌ సీపీ నేతలకు పరామర్శలు

ద్వారకాతిరుమల: మండలంలో పలువురు వైఎస్సార్‌ సీపీ నాయకులను, వారి కుటుంబాలను రాష్ట్ర మాజీ హోం మంత్రి, వైఎస్సార్‌ సీపీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత ఆదివారం పరామర్శించారు. ఎం.నాగులపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చిలక ఏసు కుటుంబాన్ని ఆమె పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అదే గ్రామంలో ఇటీవల కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న పడమటి చంద్రయ్యను పరామర్శించారు. అలాగే దేవినేనివారిగూడెంలో ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ సీనియర్‌ నాయకుడు ఆకుర్తి సత్యన్నారాయణను, కాలుకి శస్త్రచికిత్స చేయించుకున్న పెండ్లి దుర్గయ్యను, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పెండ్లి పాపాయమ్మను, పక్షవాతంతో బాధపడుతున్న పెండ్లి సత్యన్నారాయణను, పెండ్లి చెన్నయ్య కుటుంబాన్ని, అదేవిధంగా వేంపాడులో అనారోగ్యంతో బాధపడుతున్న సర్పంచ్‌ చెవల రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర క్రిస్టియన్‌ మైనారిటీ సెల్‌ ఉపాధ్యక్షుడు, ఏపీపీఎఫ్‌ రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ పి.జీవన్‌ కుమార్‌ మాజీ మంత్రి వనితను వేంపాడులో మర్యాద పూర్వకంగా కలసి, ఆమెకు దుశ్శాలువాను కప్పి, మొక్కను అందించారు. పరామర్శ కార్యక్రమాల్లో ద్వారకాతిరుమల, నల్లజర్ల మండలాల పార్టీ కన్వీనర్‌లు ప్రతాపనేని వాసు, వెల్లంకి సుబ్రహ్మణ్యం, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, నల్లూరి వెంకన్నబాబు, నల్లూరి బాపనయ్య, ఎలమర్తి సీతారామయ్య, జెక్రిపోతుల వెంకటేశ్వరరావు, శ్రీనుదాసు, నార్ని అప్పారావు, తూంపాటి భీమేశ్వరరావు తదితరులున్నారు.



దేవినేనివారిగూడెంలో సత్యనారాయణను పరామర్శిస్తున్న మాజీ హోం మంత్రి వనిత

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	70
వంకాయలు (కాంతులు)	34	బిళ్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	36
బెండకాయలు	38	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	34	కంద	--
కాకర కాయలు	40–50	బీట్‌రూట్‌	40
బీరకాయలు	30	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	40	ఫ్రెంచ్‌బీన్స్‌	96
క్యాబేజీ	24	అల్లం	60
క్యారెట్‌	36	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	34	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07–10
దోసకాయలు	20	పుదీనా	05
అనబకాయ (1)	10–15	క్యాప్సికమ్‌	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్‌ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ (ఇంద్ర)	21.00	29
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్‌) (ఇంద్ర)	21.30	35
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ (అమరావతి)	22.00	38
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ (స్టార్‌ లైనర్‌ నాన్‌ఏసీ స్లీపర్‌)	22.30	14
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్‌ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్‌ నంబర్‌	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌	21.45	4820	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌	21.15	4822	27
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు –బీహెచ్‌ఈఎల్‌ వయా రామచంద్రపురం	10.45	4798	17
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్‌ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు –ఈసీఐఎల్‌	22.30	4814	29
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీలే కీలకం

మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

పెదవేగి: పార్టీ మరింత బలోపేతానికి గ్రామ స్థాయి కమిటీలు కీలకపాత్ర పోషిస్తాయని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలోని కొఠారు అబ్బయ్య చౌదరి క్యాంపు కార్యాలయంలో మండల, గ్రామ కమిటీల ఏర్పాటుపై దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్‌ జగన్‌ కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు

నాయకులకు అభినందన

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులుగా ఎన్నికైన కామిరెడ్డి నాని, తేరా ఆనంద్‌, అప్పన ప్రసాద్‌, జానంపేట ప్రసాద్‌ బాబులను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆదివారం అభినందించారు. ఆయనతో పాటు జెడ్పీ వైస్‌ చైర్మన్‌ పెరుమాల విజయ్‌ బాబు, జెడ్పీటీసీలు నిట్టా లీలా నవకాంతం, మండలి సరస్వతి, ఎంపీపీలు బత్తుల రత్నకుమారి, తాత రమ్యశ్రీ, వైస్‌ ఎంపీపీ వేమూరి జితేంద్ర, పార్టీ నాయకులు ముంగర సంజీవ్‌ కుమార్‌, పల్లెం ప్రసాద్‌, మండలి కొండలరావు, ప్రభాకర్‌రావు, ఎం.సూర్యనారాయణ రావు, పోకల రాంబాబు, తోత్తడి వేద కుమారి, పాలడుగు సత్యనారాయణ తదితరులు వారిని అభినందించారు.

ఆత్మీయ కలయిక

దెందులూరు: దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని ఆయన కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఏపీ క్రిస్టియన్‌ మైనారిటీ సెల్‌ రాష్ట్ర వైస్‌ ప్రెసిడెంట్‌ పి.జీవన్‌ కుమార్‌ మర్యాద పూర్వకంగా కలిశారు. తనను పార్టీ తరపున రాష్ట్ర వైస్‌ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు అబ్బయ్య చౌదరికి పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరిని జీవన్‌ కుమార్‌ సత్కరించారు.

రాష్ట్ర ప్రభుత్వం జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేయాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జాబ్‌ క్యాలెండర్‌ విడుదల చేయాలని డీవైఎఫ్‌ఐ ఏలూరు జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్‌ డిమాండ్‌ చేశారు. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్‌ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా కమిటీ సభ్యులు కె అచ్చిబాబు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి జి సూర్యకిరణ్‌ మాట్లాడుతూ ఎన్నికల హామీలు నెరవేర్చాలని, ప్రతిఏటా జాబ్‌ కేలండర్‌ విడుదల చేస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకున్నా జాబ్‌ కేలండర్‌ విడుదల చేయలేదని, దీంతో నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ల కోసం 10 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారన్నారు. జూనియర్‌, డిగ్రీ, పాలిటెక్నిక్‌ కళాశాలల లెక్చరర్‌ ఖాళీ పోస్టులు, యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌ చేశారు. అటవీశాఖలోని 800 బీట్‌ ఆఫీసర్‌, రేంజ్‌ ఆఫీసర్‌ పోస్టులకు ఆర్థికశాఖ అనుమతినిచ్చినా ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. విద్యుత్‌ శాఖలో 15 వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.



డీవైఎఫ్‌ఐ సమావేశంలో మాట్లాడుతున్న జి.సూర్యకిరణ్‌